తిమ్మప్ప ఉత్సవాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- 3 నుంచి 6 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- మూడో తిరుపతిగా ప్రాచుర్యం



కొండపై వెలసిన గట్టు తిమ్మప్ప ఆలయం

మక్తల్ : మూడో తిరుపతిగా పేరుగాంచిన నియోజకవర్గంలోని మాద్వార్ నల్లకొండల్లో వెలసిన నామాల స్వామి శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి(గట్టు తిమ్మప్ప) బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమయ్యాయి. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే తిమ్మప్ప స్వామి ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నేటి నుంచి 6వ తేదీ వరకు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి.

పల్లకీసేవతో ప్రారంభం..

మక్తల్ మండలం మాద్వార్ గ్రామంలో కొండపై వెలసిన శ్రీగట్టు తిమ్మప్పస్వామి(లక్ష్మీవేంకటేశ్వర స్వామి) బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు, మక్తల్ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్, ఆలయ చైర్మన్ రాజేశ్వర్‌రావు తెలిపారు. 3న సోమవారం ఉదయం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ చైర్మన్ రాజేశ్వర్‌రావు ఇంటి నుంచి పల్లకి సేవతో కొండపైకి తీసుకెళ్తారు. పవిత్ర జలాలతో పుష్కర స్నానం చేయించి పద్మావతి లక్ష్మీవేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. కల్యాణోత్సవం సందర్భంగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

సేవల వివరాలు..

3వ తేదీ సోమవారం ప్రభోత్సవం,4న మంగళవారం కల్యాణోత్సవం, రథోత్సవం, 5న శనివారం పాలఉట్ల కార్యక్రమం, 6వ తేదీ శివస్వాముల మహపూజ కార్యక్రమం, గరుడవాహన సేవలు చేస్తారు. 5 రోజుల పాటు నిర్వహించనున్న స్వామివారి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర నలమూలల నుంచే కాకుండా షోలాపూర్, ముంబాయి, అంబర్‌నాథ్, హైదరాబాద్, గోవా, పూనా, బెంగళూర్, కర్ణాటక, వంటి పట్టణాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.



మాద్వార్‌లో కొండపై వెలసిన గట్టుతిమ్మప్ప స్వామి

ఏర్పాట్లు పూర్తి..

సోమవారం నుంచి ప్రారంభమయ్యే స్వామివారి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు రాజేశ్వర్‌రావులు తెలిపారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా నూతనంగా 15 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యం కోసం 10 ట్యాంకర్లు ఏర్పాటు చేశారు. 4వ తేదీ సాంస్కృతిక కార్యక్రమాలను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రారంభించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలు విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

మహిమలు చూపి

మాద్వార్ గ్రామంలోని కొండపై కొలువుదీరిన శ్రీగట్టుతిమ్మప్పస్వామి ఆలయాన్ని సుమారు 400 సంవత్సరాల క్రితం నిర్మించారు. పూర్వం ఈ కొండపై ప్రకృతి రమణీయమైన అందాలతో ప్రశాంత వాతావరణంలో స్వామివారు సంచరిస్తుండేవారని ప్రతీక. ప్రతిరోజు కొండపై పశువుల కాపరులతో స్వామి వారు మానవ రూపంలో ఆటలాడుతూ, తెచ్చిన సద్ది ముద్దలతో కాలక్షేపం చేసేవారు. ఒక రోజు స్వామి వారు కొండపై ఒక గుండులో ప్రత్యక్షమై మహిమలు చూపి ఇంతకాలం మీతో ఆడుతూ, పాడుతూ గడిపినది నేనే గట్టుతిమ్మప్ప స్వామినని పేర్కొన్నట్లు కథనం. అప్పటి నుంచి కలియుగ వైకుంఠం శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రతి రూపమై శ్రీగట్టుతిమ్మప్ప స్వామిగా ప్రాంత ప్రజలు పూజలు చేసి తరిస్తుండటం విశేషం. స్వామి వారిని 41రోజుల పాటు భక్తి ప్రపత్తులతో కొలిచిన వారికి ఇతిబాధలు తీరుతాయని భక్తుల విశ్వాసం.

భక్తిశ్రద్ధలతో బీరప్ప విగ్రహావిష్కరణ



ఊట్కూరులో చిన్నారులకు పట్టం కడుతున్న తల్లిదండ్రులు



కాట్రేవ్‌పల్లిలో..

మక్తల్: మండలంలోని కాట్రేవ్‌పల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీరప్ప విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నూతన విగ్రహానికి రెండు రోజుల నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బీరప్ప ఉత్సవాలు ప్రారంభం

ఊట్కూరు: మండల కేంద్రంలో కురువల ఆరాధ్య దైవం అయిన బీరప్ప ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదేళ్లకు ఒకసారి ఉత్సవాలు నిర్వహించడం అనాదిగా వస్తుంది. ఉత్సవాల్లో భాగంగా బీరప్పస్వామికి పల్లకీసేవ నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి మేళతాళాలతో శోభయాత్ర చేపట్టారు. అనంతరం చిన్నారులకు పట్టం కట్టె కార్యక్రమాన్ని కనులపండుగగా నిర్వహించారు. కార్యక్రమంలో గోవిందప్ప, పోలప్ప, ఆశప్ప, రామకృష్ణ, శ్రీనివాస్, బాల్‌రాం, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

హోమం పూజలు

మరికల్: మాధ్వార్‌లో నూతనంగా నిర్మించిన బీరప్పస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రాహ్మణులు నాగరాజ్‌శర్మ, శివప్రసాద్‌శర్మ మొదటి రోజు హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతులతో బ్రాహ్మణులు హోమం జరిపించి విగ్రహాలను నీటిలో ఉంచారు. రెండో రోజు విగ్రహాల ప్రతిష్ఠాపన ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా శివలింగ ప్రతిష్ఠాపనోత్సవాలు

దామరగిద్ద: మండలంలోని బాపన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన శివాలయంలో శివలింగ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయ పరిసరాలు శివనామ స్మరణతో మార్మోగాయి. రెండు రోజుల పాటు గణపతి పూజ, అఖండ దీపారాధన, రుద్రహోమం, జల, ధాన్య, ధనాదివాస పూజలు నిర్వహించారు. ఆదివారం శివలింగ, భ్రమరాంబిక, గణపతి, జంట నాగులు, నవగ్రహ ప్రతిష్ఠాపన, ప్రాణప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి కుంభాభిషేకం పూజలు చేశారు. దాతలు రాజ్‌కుమార్‌రెడ్డి, గవినోళ్ల శ్రీనివాస్ తదితరులను ఆయల కమిటీ తరఫున ఘనంగా సత్కరించారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సనార్ధన్‌రెడ్డి, సంతోష్, రాములు, అంజి, పాండు, హన్మంతు, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.



దాత రవికుమార్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

క్లుప్తంగా

సరస్వతి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



మరికల్: మండలంలోని కన్మనూర్ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆవరణలో ఆదివారం ఘనంగా సరస్వతీ దేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ సొంత ఖర్చులతో రెండు పాఠశాలల్లో సరస్వతీ దేవి విగ్రహాలను ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామస్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

నారాయణపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేశారని, నిధులు కేటాయించకుండా వివక్ష చూపినందుకు నిరసనగా టీపీసీసీ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికారెడ్డి సూచనతో సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని నర్సిరెడ్డి చౌరస్తాలో డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం ఉంటుందని పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు అందరూ భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అంబులెన్స్‌లో ప్రసవం

మాగనూర్: కృష్ణా మండలంలోని గుడెబల్లూర్ గ్రామానికి చెందిన పార్వతమ్మకు ఆదివారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. గర్భిణిని మాగనూర్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా.. నల్లగట్టు సమీపంలోకి రాగనే నొప్పులు అధికం కావడంతో ఈఎంటీ రాకేష్ అంబులెన్స్‌లోనే కాన్పు చేయించారు. బాలింతతో పాటు బిడ్డ ఆరోగ్యంగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం వైద్య పరీక్షల కోసం మాగనూర్ ఆస్పత్రికి తరలించారు.

సీసీ రోడ్లు వేశారు.. మట్టి మరిచారు



కొత్తపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయి ఏడాది గడిచినా సైడ్ మట్టి వేయడంలో కాంట్రాక్టర్లు అలసత్వం వహిస్తున్నారు. మండలంలో రూ.కోట్ల నిధులు మంజూరు కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేశారు. కానీ రోడ్డుకు సైడ్‌గా మట్టివేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సీసీ రోడ్లకు సైడ్ మట్టి వేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రిటైర్డ్ డీఈఓకు అవార్డు



నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ డీఈఓ ఆవుటి జగదీష్‌కు బుక్ రీడింగ్ చాంపియన్‌షిప్ అవార్డు లభించింది. ఫుడ్ ఫర్ థ్రోట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 2025 సంవత్సరానికి గాను ఇండియన్ రీడింగ్ ఒలంపియాడ్ ఆధ్వర్యంలో రీడింగ్ హాబిట్స్ అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆవుటి జగదీష్ చక్కటి ప్రతిభ కనబరిచి అవార్డును సొంతం చేసుకున్నారు. గ్రామంలో సర్వోదయ గ్రామీణ గ్రంథాలయాన్ని నడుపుతూ పుస్తకాలు చదవడం అలవాటుగా మార్చుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన అవార్డు అందుకున్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.26 లక్షలు మంజూరు

వీపనగండ్ల: మండలంలోని కల్వరాలలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.26 లక్షలు మంజూరు చేయించినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ తెలిపారు. ఎస్సీ కాలనీలో సరైన రోడ్డు వసతి లేక కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద డబ్బులను మంజూరు చేయించారని, సీసీ రోడ్లతో పాటు డ్రెయినేజీలను నిర్మిస్తామని ఆయన తెలిపారు. నిధులు మంజూరు చేయించిన మంత్రి జూపల్లికి గ్రామంలోని పలువురు కృతజ్ఞతలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో అబ్దుల్ రహీం గంధోత్సవం



గంధం ఊరేగిస్తున్న భక్తులు

మదనాపురం: కులమతాలకతీతంగా జరిగే అబ్దుల్‌రహీం ఆరాధన ఉత్సవాలు మండలంలోని దుప్పల్లిలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగే ఈ ఉత్సవాలకు తెలంగాణతో పాటు కర్ణాటక, ఒడిశా, మహరాష్ట్ర, తదితర ప్రాంతాల నుంచి భక్తులు హాజరై దర్గాను దర్శించుకుంటారు. ఉర్సు ప్రధాన ఘట్టమైన గంధోత్సవం ఆదివారం రాత్రి దర్గా నుంచి భక్తులు గంధాన్ని తలపై పెట్టుకొని ఊరేగింపుగా తీసుకెళ్లి మహబుబ్‌సుబాని దర్గాకు సమర్పించారు. ఈ వేడుకకు తాండూర్ సయ్యద్ అబ్దుల్ కరీం దర్గా పీఠాధిపతులు సయ్యద్‌సాబేర్ పాష, అజీష్ పాష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

5న లేబర్ కోడ్ల అమలుపై కార్మికుల నిరసన

వనపర్తిరూరల్: కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను అమలును ఆపాలని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 5న నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, కార్యదర్శి మోష, టీయూసీఐ నాయకులు రాజు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. దేశంలో కార్మికులు దశాబ్దాలుగా పోరాడి కార్మిక చట్టాలను సాధించుకున్నారన్నారు. సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా విభజించి నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ఈ కోడ్‌లను ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ఇవి అమలైతే కార్మికులు సమ్మె చేసే హక్కు, జీతాలు పెంచమని అడిగే హక్కు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు

వ్యవసాయ కూలీలు, రైతులు, సంయుక్త కిసాన్ మోర్చా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్, ఉప కార్యదర్శి గోపాలకృష్ణ, రాములు, గణేష్, రమేష్, డంగుకుర్మయ్య పాల్గొన్నారు.

‘మా ప్లాట్లు మాకు కావాలి’

అమరచింత: పట్టణంలోని సర్వేనంబర్ 582లో గల వ్యవసాయ పొలాన్ని వెంచర్‌గా మార్చి ప్లాట్లను స్కీం పద్ధతిన విక్రయించారని, అలాంటి స్థలంలో తమకు కేటాయించిన పత్రాల ప్రకారం ప్లాట్లు చూపించాలని లబ్ధిదారులు ఆదివారం వెంచర్‌లో ఆందోళన నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. 25 ఏళ్ల కిందట పట్టణంలోని ఎల్లా సుదర్శన్, ఎల్లా బాలస్వామి తమకు చెందిన సర్వేనంబర్ 582లో గల పొలాన్ని ఇంటి స్థలాల కోసం వెంచర్‌గా మార్చుకున్నారు. వీటిలోని ప్లాట్లను అమ్మేందుకు స్కీం ద్వారా నెలవారీగా డబ్బులు కట్టించుకున్నారు. మొత్తం డబ్బులు ముట్టిన తర్వాత లబ్ధిదారులకు ప్లాట్ విక్రయిస్తున్నట్లు బాండ్ పేపర్లపై రాసిచ్చారని, ప్రస్తుతం తమకు ఒకొక్కరు రూ.లక్ష ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. లబ్ధిదారులు ప్లాట్ల విక్రయ స్థలంలో ఏపుగా పెరిగిన ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేసి.. అక్కడే సమావేశం నిర్వహించి తమకు న్యాయం జరిగే వరకు పోరాడతామని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న సీపీఎం మండల కార్యదర్శి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జీఎస్ గోపి లబ్ధిదారులను కలిసి న్యాయం జరిగే వరకు మద్దతుగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బాధితులు చాకలి వెంకటేష్, ఖాజాహుస్సేన్, షబ్బీర్, చారి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెంచర్‌లో తమ ప్లాట్లు చూపాలని ఆందోళన చేస్తున్న బాధితులు

విహారయాత్రతో విద్యార్థుల్లో సృజనాత్మకత

ఆత్మకూర్: పట్టణంలోని కేపీటీ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న 60 మంది విద్యార్థులు ఆదివారం విహారయాత్రకు బయలుదేరారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ఎం అనురాధ మాట్లాడుతూ విహారయాత్రలు విద్యార్థులకు సృజనాత్మకతను పెంపొందించేందుకు కృషి చేస్తాయన్నారు. మహబూబ్‌నగర్‌లోని కలెక్టరేట్, పిల్లలమర్రి ఏకోపార్కు, మ్యూజియం తదితర ప్రదేశాలను చూపించి అవగాహన కల్పించామన్నారు. అలాగే తమ పాఠశాలలో పీఎంశ్రీ పథకంలో భాగంగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ ఇంగ్లిష్ మీడియంలో విద్యా బోధన చేపడుతున్నామని, ఇందుకు గాను వలంటీర్‌ను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.



విహార యాత్రలో విద్యార్థులు

ఆలయ అభివృద్ధికి విరాళం



నగదును అందజేస్తున్న ముదిరాజ్ నాయకులు.

దామరగిద్ద: మండలంలోని బాపన్‌పల్లి శివాలయ అభివృద్ధికి మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రూ.11 వేల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ తరఫున దాతలను శాలువాతో సన్మానించారు. ఆలయ అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు మొగులప్ప, బస్సప్ప, వెంకట్రాములు, హన్మంతు, వెంకటేష్ పాల్గొన్నారు.

కోనేరు శుభ్రం చేసిన స్వయం సేవకులు



నారాయణపేట రూరల్: మండలంలోని ఎక్లాస్పూర్ శివారు గుట్టపై వెలసిన తిమ్మప్ప స్వామి జాతర ఈ నెలలో జరగనుంది. వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామిని దర్శించుకునే ముందు గుట్ట కింద ఉన్న కోనేరులో స్నానమాచరిస్తారు. అయితే కోనేరు పూర్తిగా చెత్తాచెదారంతో నిండి ఉండడంతో ఆదివారం గ్రామానికి చెందిన ఆర్ఎస్ఎస్ సభ్యులు కోనేరును శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం పూర్తిగా తొలగించి పురాతన కోనేరుకు కొత్త శోభను తీసుకొచ్చారు.

వాల్‌పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మాగనూర్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు లక్షల డప్పులు, వేల గొంతుకల కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం సీనియర్ నాయకుడు మణిగిరి మాదిగ మాట్లాడుతూ ఈ నెల 7న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు తలపెట్టిన లక్ష డప్పులు వేల గొంతుకల కార్యక్రమానికి మండలంలోని మాదిగ నాయకులు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కర్రెప్ప, ఆనంద్, దినేష్, వాబయ్య, మొగులప్ప, నర్సిములు, క్రిష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పూసల్ పహడ్ టాలెంట్ టెస్ట్



మక్తల్‌లో పూసల్‌పాడు టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రం విడుదల చేస్తున్న నిర్వాహకులు

మక్తల్: పట్టణంలో భగవాన్ సత్యసాయి మందిరంలో పూసల్‌పాడు గ్రామానికి చెందిన షేర్ ఎల్లారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కూమారుడు షేర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పూసల్‌పాడు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షకు మండలంలోని 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. పదో తరగతిలో విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి టాలెంట్ టెస్ట్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో రిటైర్డు హెచ్ఎం భాస్కర్, తపస్ మండల అధ్యక్షుడు రవీందర్, కార్యదర్శి రాకేష్‌కుమార్, వెంకట్‌రాములు, ప్రవర్ధన్, రామాంజనేయులు, వినయ్, రమేష్, వనజ, పుష్పలత, సుభాషిణి, విజయశ్రీ, పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం పూసల్‌పహాడ్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల నుంచి 346 మంది పదో తరగతి విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారు. త్వరలోనే టాలెంట్ టెస్టు ఫలితాలను వెల్లడించి ర్యాంకులు ప్రకటిస్తామని నిర్వాహకులు శేర్‌కృష్ణారెడ్డి, రాజేష్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మరికల్: మండలంలోని కన్మనూర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 1998–99 పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారికి బోధించిన ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు. 25 ఏళ్ల తర్వాత అందరూ ఒకే వేదికపై కలుసుకోవడంతో గత జ్ఞాపకాలను స్మరించుకున్నారు. వారితో పాటు చదువుకొని మృతి చెందిన స్నేహితులను, పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను స్మరించుకుంటూ నివాళులర్పించారు.

‘పెగడబండ’ను పంచాయతీగా ప్రకటించాలి

మాగనూర్: మండలంలోని అడవిసత్యారం గ్రామ పంచాయతీ పరిధిలో అమ్లెట్ గ్రామమైన పెగడబండను నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పెగడబండ గ్రామానికి అన్ని అర్హతలు ఉన్నాయని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని అంటున్నారు. ముఖ్యంగా అభివృద్ధిలో కుంటుపడిందని, ఇప్పటికే అన్ని శాఖల అధికారులకు విన్నవించామన్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికల లోపు నూతన పంచాయతీగా ఏర్పాటు చేసి గ్రామస్తుల ఆకాంక్ష నెరవేర్చాలని కోరుతున్నారు.

ఆనంద్‌కు సత్కారం

ఆత్మకూర్: జాతీయ మత్స్యసంపద యోజన పథకంలో భాగంగా రాష్ట్రం తరఫున ఆరేపల్లికి చెందిన మత్స్యకారుడు ఏటికాడి ఆనంద్ రాష్ట్రపతి అవార్డు అందుకోవడం గర్వకారణమని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లో ఎంపీ ఆనంద్‌ను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరేపల్లిలో పదేళ్లుగా చేప పిల్లను ఉత్పత్తి చేస్తూ రాష్ట్రంలోని వివిధ జిల్లాలో సబ్సిడీ చేపపిల్లలను ప్రభుత్వం ద్వారా పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అశోక్, కంభాళపురం రాము, సుధాకర్, నరేందర్ తదితరులు ఉన్నారు.



బడ్జెట్ కేటాయింపులో అన్యాయం

అమరచింత: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రంలోని కార్మిక, కర్షక వర్గాలతో పాటు సామాన్యులకు అన్యాయం జరిగిందని సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ జాతీయ ఉపాధి హమీ పథకానికి సంబంధించి నిధుల కేటాయింపులో వివక్ష చూపారని మండిపడ్డారు. ఉపాధికూలీ రోజువారి రూ.600 మేరకు చెల్లించాలని, ఏడాదిలో 200 రోజుల పనిదినాలు కల్పించాలని, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి పనులను చేపట్టాలని ఆందోళన చేస్తున్నా.. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సంపన్నుల కోసమే కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టినట్లుందన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు కేవలం 2 శాతం నిధులు కేటాయించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో రాష్ట్ర వాటా పెంచాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ రమేష్, అజయ్, వెంకటేష్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు